# తిరిగివచ్చే కథ

నా రూంమేట్ శాతకర్ణి కథలు రాసుంటాడు. రోజూ కొన్ని కాగితాలు నలుపుచేసుంటాడు అతని కథలు తిరిగి వస్తూంటాయి. వాటిని కవర్లలోంచి తీసి చదివే స్వతంత్రం వుంది కాబట్టి అప్పుడప్పుడు చదువుతుంటాను.

నేను పనిచేసే బ్యాంక్ గదికి దగ్గరే కాబట్టి నేనే గదికి ముందు వసుంటాను. శాతకర్ణి బాల్‌నగర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని వో కంపెనీలో పనిచేస్తున్నాడు. అతనొచ్చేసరికి రాత్రి ఏడున్నర దాటుతుంది.

గదితలుపు తెరవగానే ఎదురుగా పొడుగాటి కవరు కనబడితే, దాని మీద ముఖ్యంగా శాతకర్ణి చేతి వ్రాత వుంటే అందులో తిప్పి పంపబడ్డ కథ వుంటుంది

చాలాసార్లు తిరిగివచ్చింది వో కథ.

దానిపేరు "జీవితం"

కనీసం పదిసార్లయినా అది తిరిగిరావటం గమనించాను. నిజానికి ఆ కథ నాకు నచ్చలేదు! ఎన్నో మంచికథలు రాసే శాతకర్ణి అలాంటి చెత్తకథలు రాసి అది ప్రచురించబడాలని ఘజనీ మొహమ్మద్‌లా తాపత్రయ పడటం నాకు నచ్చలేదు.

మరోసారి తిరిగివచ్చాక అడిగాను శాతకర్ణిని.

"దీన్ని చింపి పారేయరాదూ? ఇంత చెత్తకథ రాశావెందుకు? దీన్లో చక్కటి మార్పులు చెప్పనా నేను."

శాతకర్ణి ఆ కథని నా ముందే చింపేశాడు తర్వాత నవ్వి చెప్పాడు

"నాకూ తెలుసు అది చెత్తకథని. యిది తిరిగి రావాలనే పంపుతున్నాను"

"నీకేం మతిపోయిందా? ఏ రచయితా కథ తిరిగిరావాలని కోరుకోడనుకుంటున్నాను ఇంతదాకా" చెప్పాను"

"కాని నేను దీన్ని వో మంచి కథతోపాటు తప్పనిసరిగా జతచేస్తాను. ఖచ్చితంగా తిరిగివస్తుంది"

"చిన్న గీతముందు పెద్ద గీతలాగా ఇది ఆ రెండో కథని బావుందనిపించేలా చేస్తుందనా?"

"కాదు మరో కారణం ఉంది"

"ఏమిటది?"

ఆ కథ వచ్చిన కవరుమీద అతికించిన స్టాంప్ని చూపించి చెప్పాడు.

"మంచికథ ఒకటే పంపితే ఈ కవరు తిరిగి వచ్చేది కాదు. కేవలం ఆ కథ అంగీకరిస్తూ తెలియచేసే ఉత్తరం వస్తుంది. దీని వల్ల ఈ కవరు కూడా తప్పక తిరిగి వస్తుంది. ఈ కవరు మీద స్టాంప్ చూసేవుగా? ప్రత్యేకించి విడుదల చేసే స్టాంప్స్ అతికిస్తాను రిటర్న్ కవర్స్ మీద. స్టాంప్స్ కలెక్షన్స్‌లో ఇదో పద్ధతి నాకు."

ఆ కవరు నించి స్టాంప్స్‌ని జాగ్రత్తగా వేరుచేసి దాన్ని ఆల్బంలో అతికించాడు.

ఆ తర్వాత మరో కథ రాసినట్లున్నాడు శాతకర్ణి ఋండు కోసం

"అసాధారణం" అనే మరోకథ చాలాసార్లు తిరిగి రావడం గమనించాను.